**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**ఈ రోజు (27 అక్టోబర్, 2017) విజయవాడలోని సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశం జరిగింది. దీనిలో రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు. ప్రెస్‌మీట్‌లో ఇచ్చిన నోట్‌ను ప్రచురణార్థం/ ప్రసారార్థం కొరకు పంపుతున్నాం. -జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి**

# రేషన్ డిపోలను రిలయన్స్ మాల్స్‌గా మార్చడానికి ఖండన
# నవంబర్ 1 నుండి 10 వరకు నిరసనలకు పిలుపు

మోడీ, బాబూ ఇద్దరూ కలిసి రేషన్ షాపులు మూతేస్తున్నారు. అందుకే రేషన్‌కు బదులు నగదు బదిలీ అంటూ పేదల పొట్టకొట్టే కుటిలయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో 29 వేల రేషన్ షాపులను దశలవారీగా 'అన్న విలేజ్ మాల్స్'గా మార్చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. 6,500 షాపులను తొలిదశలో 'రిలయన్స్'కు, చంద్రబాబు కుటుంబ వ్యాపార సంస్థ 'హెరిటేజ్'కు వాటా ఉన్న 'ఫ్యూచర్స్'కు ఇస్తామని ప్రకటించారు. అన్న విలేజ్ మాల్స్ నిర్వహణ ఖర్చులో 25% ప్రభుత్వమే భరిస్తుందని, మరో 25% ముద్ర బ్యాంకు నుండి అప్పు ఇప్పిస్తామని ప్రకటించారు. రిలయన్స్ లాంటి కార్పొరేట్ సంస్థలపట్ల చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న అనుకూల విధానాలకు ఇది నిదర్శనం.

బియ్యం వద్దనుకున్న వారికి కిలో బియ్యానికి 25 రూపాయలు చొప్పున నగదు బదిలీ చేస్తారని, ఆ నగదుతో రిలయన్స్, ఫ్యూచర్స్ మాల్స్‌లోనే తమకు కావాల్సిన ఇతర సరుకులు కొనుక్కోవచ్చని ప్రజలకు హితబోధ చేస్తున్నారు. దీనర్థం రిలయన్స్, ఫ్యూచర్స్ మాల్స్‌కు రిటైల్ వ్యాపారం గ్యారెంటీ చేయడమే. రేషన్ కార్డులు ఉన్నవారంతా రిలయన్స్, ఫ్యూచర్స్ మాల్స్‌కు వెళ్ళక తప్పదు. దీని పర్యవసానంగా గ్రామాల్లో చిల్లర వ్యాపారాలన్నీ దివాలా తీస్తాయి.

ప్రజలనుండి వ్యతిరేకత రాకుండా బియ్యం కావాల్సిన వారికి బియ్యం ఇస్తామని చెబుతున్న మాటలు తాత్కాలికమే. అంతిమంగా అందరికీ నగదు బదిలీ అమలుజేస్తారు. నేడు 20 కిలోలు ఇరవై రూపాయిలకు అందుతుంది. నగదు బదిలీ వల్ల అదే 20 కిలోల బియ్యాన్ని భవిష్యత్‌లో 1000 రూపాయిలకు కొనుక్కోవాలి. అంటే ప్రస్తుతం ప్రజలు చెల్లించే 20 రూపాయలకు బదులు 500 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. ఇది పేదల కడుపు కొట్టడమే. ప్రజా పంపిణీ వ్యవస్థ వల్ల మార్కెట్లో బియ్యం ధర నియంత్రణలో ఉంది. నగదు బదిలీ పూర్తిగా అమలయితే బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. మరోవైపు ఫ్యూచర్ ట్రేడింగ్ పేరుతో వ్యవసాయ దిగుబడులన్నీ బడా కార్పొరేట్ సంస్థలు కొనుగోలు చేస్తాయి. బియ్యంతో సహా నిత్యావసరాల ధరలు దారుణంగా పెంచి కార్పొరేట్ కంపెనీలు ప్రజల్ని కొల్లగొడతాయి. విలేజ్ మాల్స్ బడా కార్పొరేట్లకు లాభాలు కట్టబెడతాయి.

నగదు బదిలీతో ప్రజాపంపిణీ వ్యవస్థ అవసరం ఉండదు. ధాన్యం ఇతర పంటల సేకరణ బాధ్యత ప్రభుత్వానికి ఉండదు. మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యం ఉండదు. ఇక రైతులను అడ్డగోలుగా దోచుకునే మార్కెట్ శక్తులకు ఎదురే ఉండదు. నగదు బదిలీ కారణంగా రైతులు కూడా తీవ్రంగా నష్టపోతారు. భారత ఆహార సంస్థను మూసేసి ప్రజాపంపిణీ వ్యవస్థను దెబ్బదీసే నగదు బదిలీ లక్షలమంది హమాలీలు, ఉద్యోగులు ఉపాధి హరిస్తుంది.

అందువల్ల విలేజ్ మాల్స్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, రేషన్ షాపులను కొనసాగించాలని, లోపాలను సరిదిద్ది ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపర్చాలని ప్రభుత్వాన్ని సిపియం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుంది. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రభుత్వ కుట్రలను త్రిప్పి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. నవంబర్ 1 నుండి 10 వరకు జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతున్నాం.

## నవంబర్ 8న 'బ్లాక్ డే'ను జయప్రదం చేయండి

ప్రభుత్వం నల్లధనాన్ని అరికట్టడానికి, ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి, నకిలీ కరెన్సీ అంతు చూడడానికి మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా పెద్దనోట్లను రద్దుచేసి దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. అలాగే జిఎస్టీ తెచ్చి చిన్న వ్యాపారాలను దెబ్బదీసింది. మోడీ అనాలోచిత ప్రజా వ్యతిరేక చర్యకు ఏడాది గడిచిన సందర్భంగా నవంబర్ 8వ తేదీన వామపక్షాలు బ్లాక్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. దీనిని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

= = = =